# ఒకేచోట ఉభయ సభలు

- వచ్చే సమావేశాల నుంచి పాత అసెంబ్లీ భవనంలో మండలి
- మరమ్మతులు, సుందరీకరణ పనులపై దృష్టిసారించండి
- నిర్మాణ ప్రతిపాదనలపై సమగ్ర నివేదికలు ఇవ్వండి
- అసెంబ్లీ సెక్రటరీ, ఆర్అండ్‌బీ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి అసెంబ్లీ, శాసనమండలి ప్రాంగణాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు భట్టి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సమావేశాలను పక్కపక్కనే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే శాసనమండలి సమావేశాలను పాత అసెంబ్లీ సమావేశ మందిరంలో (ప్రస్తుత అసెంబ్లీ సమావేశ మందిరం పక్కన ఉన్న) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులకు సూచించారు. ఈలోగా అవసరమైన మరమ్మతులు, సుందరీకరణ పనులు పూర్తిచేయాలని కోరారు. బుధవారం ఆయన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి అసెంబ్లీ, శాసనమండలి ప్రాంగణాలను కలియతిరిగారు. అసెంబ్లీ లోపల సెంట్రల్‌హాల్ పక్కనే మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంటీన్ ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అసెంబ్లీ లాబీకి ఇరువైపులా ఉన్న హాల్స్, పై అంతస్థుల్లోని అసెంబ్లీ హాల్స్‌ను పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్దకు చేరుకుని నివాళి అర్పించారు. అక్కడి నుంచి నేరుగా శాసనసమండలికి వెళ్లేదారిలో (అసెంబ్లీ వెనుక) ఉన్న ఉద్యానవనాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి శాసనమండలికి చేరుకుని కలియతిరిగారు.

### పార్లమెంట్ లాంజ్ తరహాలో సుందరీకరణ

శాసనమండలికి, శాసనసభకు మధ్య ఉన్న ప్రాంతాన్నంతా నూతన పార్లమెంటు తరహాలో సుందరీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఫిట్‌నెస్ సెంటర్, సెంట్రల్ లైటింగ్, ఎటుచూసినా ఆహ్లాదకరంగా ఉండేలా పరిసర ప్రాంతాలను సుందరీకరించాలని చెప్పారు. అవసరమైతే అసెంబ్లీ సమావేశాల అనంతరం నూతన పార్లమెంటు (సెంట్రల్ విస్టా) ప్రాంగణాన్ని పరిశీలించి రావాలని అసెంబ్లీ కార్యదర్శికి సూచించారు. ప్రస్తుతం అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న పలు పార్టీల శాసనసభాపక్ష కార్యాలయాలను కూల్చివేసి వాటిని మరోచోట నిర్మించడంతోపాటు ప్రజాప్రతినిధుల వాహన పార్కింగ్ స్థలాలు తదితర ప్రతిపాదనలపై సమగ్ర నివేదికను ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శి, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డిని ఆదేశించారు.

### మండలిని పరిశీలించిన సీఎం

రాష్ట్ర శాసనమండలి, పరిసర ప్రాంగణాలను బుధవారం పరిశీలించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), కొండ సురేఖ తదితరులు శాసనమండలి ప్రాంగణం, సమావేశ మందిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ వారిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఏర్పాట్లపై ఆమె బుధవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ఈ నెల 18న హైదరాబాద్‌కు వస్తారని, ఐదు రోజుల విడిది అనంతరం 23న తిరుగు ప్రయాణం అవుతారని చెప్పారు. వైద్యారోగ్య, రోడ్లు భవనాలు, మున్సిపల్, విద్యుత్తు తదితర శాఖలు కూడా బ్లూ బుక్ ప్రకారం పూల్ ప్రూఫ్ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. సమీక్షలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



బాన్సువాడలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

## పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- బీఆర్ఎస్‌కు గ్రామాల్లో బలమైన నాయకత్వం
- నన్ను గెలిపించి ప్రజలు చరిత్ర తిరగరాశారు
- కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, డిసెంబర్ 13 : బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లో శక్తివంతమైన నాయకత్వం ఉన్నదని, పంచాయతీ ఎన్నికలకు అందరూ సన్నద్ధం కావాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఓ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల కృతజ్ఞత సభ, ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. సమైక్య రాష్ట్ర చరిత్రలో స్పీకర్‌గా పనిచేసి తర్వాతి ఎన్నికల్లో గెలువరనే చరిత్రను బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు తిరగరాసినట్టు పేర్కొన్నారు. తన గెలుపు కోసం రెండు నెలలుగా విశ్రమించకుండా కష్టపడిన కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే సమర్థిస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికలకు గులాబీ సైనికులు సిద్ధం కావాలని సూచించారు. ఐక్యంగా పనిచేసి పంచాయతీ ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

### నేడు ఐదుగురు మంత్రుల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రులుగా గురువారం ఐదుగురు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్తు శాఖల మంత్రిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా శ్రీధర్‌బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ, సమాచార పౌరసంబంధాలు, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు తీసుకోనున్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఉదయం 9 గంటల్లోగా బాధ్యతల స్వీకరణ ముగించనున్నారు.

### భట్టి అధికారిక నివాసంగా ప్రజాభవన్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): బేగంపేటలోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌ను ప్రభుత్వం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటాయించింది. ప్రజాభవన్‌లోని నివాస భవనం ఆయన అధికారిక నివాస భవనంగా కొనసాగనున్నది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### డిప్యూటీ సీఎంను కలిసిన బీసీ ఉద్యోగ నేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడెపాక కుమారస్వామి, ముత్యం వెంకన్న గౌడ్ బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. తెలంగాణ విద్యుత్తు సంస్థలు ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ సంస్థల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సమీక్షించి, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. విద్యుత్తు సంస్థల్లో సీఎండీ, డైరెక్టర్ పోస్టుల్లో 50 శాతం పదవులను బీసీ కులాల అధికారులతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

### వేతనాలు ఇప్పించండి

- సీఎంకు పదోన్నతి పొందిన వీఆర్ఏల విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సాంకేతిక కారణాల వల్ల ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని పదోన్నతి పొందిన వీఆర్ఏలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారు బుధవారం సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. 16 వేల మంది వీఆర్ఏలను ప్రభుత్వం ఐదు నెలల కిందట క్రమబద్ధీకరించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిందని చెప్పారు. కోర్టు కేసుల కారణంగా తమకు ఎంప్లాయ్ ఐడీ క్రియేట్ కాలేదని, వేతనాలు రావడం లేదని చెప్పారు. ఇటీవల న్యాయ వివాదం తొలిగిపోయిందని, వెంటనే తమకు ఎంప్లాయీ ఐడీలు క్రియేట్ చేసి వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే పరిష్కరించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. కార్యక్రమంలో జీ శ్రీనివాస్ యాదవ్, రాజేందర్, లింగరాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్వోగా అయోధ్యరెడ్డి బాధ్యతల స్వీకరణ



సీఎం సీపీఆర్వోగా నియమితులైన అయోధ్యరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

### కేంద్ర, రాష్ట్రాల నడుమ పరస్పర సహకారం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రేవంత్ ఫోన్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతర అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్ చేశారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని కిషన్‌రెడ్డిని సీఎం కోరారు.

### సీఎంతో ప్రభుత్వ వైద్యుల సంఘం భేటీ

సుల్తాన్ బజార్, డిసెంబర్ 13: సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోర్ కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీఎం.. త్వరలోనే ఆ శాఖ మంత్రి సమక్షంలో వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సీఎంను కలిసినవారిలో కోర్ కమిటీ సభ్యులైన డాక్టర్లు పల్లం ప్రవీణ్, బీ రమేశ్, నరహరి, రంగా అజ్మీరా, లాలూప్రసాద్ రాథోడ్, వినోద్ తదితరులు ఉన్నారు.



సంపత్‌రెడ్డి సంతాప సభలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు కడియం, పల్లా, ఎర్రబెల్లి, సుదర్శన్‌రెడ్డి

## సంపత్‌రెడ్డి సేవలను మరువలేం

- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం
- ఎమ్మెల్యేలు కడియం, పల్లా, మాజీ మంత్రి ఎర్రబెల్లి

చిల్పూరు, డిసెంబర్ 13: తెలంగాణ ఉద్యమకారుడిగా, జనగామ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా, జడ్పీ చైర్మన్‌గా పాగాల సంపత్‌రెడ్డి సేవలను మరువలేమని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కొనియాడారు. బుధవారం జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరంలో ఏర్పాటు చేసిన సంపత్‌రెడ్డి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ.. సంపత్‌రెడ్డి, ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ లాంటి నాయకులను పార్టీ కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి పార్టీతోపాటు ఎమ్మెల్యేలం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 14 ఏండ్ల నుంచి సంపత్‌రెడ్డితో కలిసి ఉన్నామని, ఆయన మృతి బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో నేతలు బండా ప్రకాశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ముత్తిరెడ్డి తదితరులు పాల్గొనారు.

## కార్పొరేషన్ల పనితీరు మారాలి

- రైతుకు నష్టం కలిగించే విధానాలను ఉపేక్షించం
- కార్పొరేషన్ల ఆస్తుల జాబితాను సిద్ధం చేయాలి
- భవిష్యత్ ప్రణాళికపై నివేదిక ఇవ్వాలి
- ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ పరిధిలోని అన్ని కార్పొరేషన్ల పనితీరు పూర్తిగా మారాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 14 వ్యవసాయ కార్పొరేషన్ల పనితీరుపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కార్పొరేషన్లు కేవలం లాభాపేక్షతో పనిచేయకుండా రైతులకు ఉపయోగపడే విధానాలను అమలు చేయాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే విధానాలను ఉపేక్షించేది లేదని, ఎరువులు, వ్యవసాయ యంత్రాల సరఫరా తదితర అంశాల్లో ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధానాలను ప్రోత్సహించొద్దని తేల్చిచెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న భూములను శాఖపరంగా వినియోగించుకునేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని, అన్ని కార్పొరేషన్ల ఆస్తుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ల అభివృద్ధికి వెంటనే ప్రణాళిక రూపొందించుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని వాటిని సక్రమంగా అమలు పరిచే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ దిశగా ఇప్పటివరకు కార్పొరేషన్లు చేసిన కృషిపై నివేదిక సమర్పించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

## టీనాబ్ డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య



హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో (టీఎస్‌నాబ్) డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ సీపీగా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించిన తర్వాత అదే భవనంలో ఉన్న టీనాబ్ కార్యాలయంలో శాండిల్య బాధ్యతలు స్వీకరించారు. టీనాబ్ ఎస్పీ సునీతారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## సంక్రాంతికి అందుబాటులోకి బైరామల్‌గూడ లూప్!



ఎస్సార్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) నిర్మాణాల్లో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ తరహాలో గ్రేటర్ హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నియోజకవర్గం బైరామల్‌గూడ చౌరస్తాలో ప్రతిష్ఠాత్మకంగా లూప్ ఆకారంలో నిర్మించిన అరుదైన ప్రాజెక్టు అందుబాటులోకి రాబోతున్నది. దాదాపు రూ.135 కోట్లతో లూప్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. సంక్రాంతి నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీర్లు పనులను వేగవంతం చేశారు. ఎల్బీనగర్, చంపాపేట, సాగర్ రింగ్ రోడ్ మార్గాల వైపు వెళ్లేందుకు ఈ లూప్‌లు ఎంతగానో దోహదపడనున్నాయి. బైరామల్‌గూడలో రెండు ఫ్లైఓవర్లు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

